



"ప్రేమారావ్ లవ్ ఇనిస్టిట్యూట్ .... ఇచ్చట ప్రేమించుటకు అమ్మాయిలను చూపబడును....సలహాలు ఇవ్వబడును" అన్న బోర్డుచూసి గట్టిగా గాలి పీల్చుకున్నాడు ప్రేమదాసు. తనకి కావలసిన ఇల్లు ఇదే. సులభంగానే కనుక్కోగలిగాడు. చిన్నమేడ—క్రింది భాగాల్లో ఎవరో అద్దెకున్నట్టున్నారు. మేడపైన గదికి బోర్డు తగిలించబడివుంది. మేడకు ఎడమవైపున మెట్లు. పక్కనే 'పైకిదారి' అని రాసివున్న బోర్డు. ఒకవైపు మెట్లు కనిపిస్తున్నా 'పైకిదారి' అని ఎందుకు రాశారో ప్రేమదాసుకు అర్థంకాలేదు.

మెట్లెక్కి పైకి చేరుకున్నాడు. చిన్న గది. గది తలుపు తెరిచివుంది. తలుపు దగ్గరగా వేసివున్న కుర్చీలో ఎవరో ఒకతను ముప్పై యేళ్ళుంటాయేమో –

కూర్చుని గోడనున్న క్యాలెండరుమీది అమ్మాయి నగ్న చిత్రాన్ని చూస్తూ "జగమేమాయా – బ్రతుకేమాయా" అని పాడుకుంటున్నాడు. ఈయనే ప్రేమారావు అనుకున్నాడు ప్రేమదాసు. సన్నగా తోటకూర కాడలావున్నాడు – పట్కారుతో వంకర తిప్పినట్టున్న ముక్కు—ఎవరో పట్టి లోపలకు లాగినట్టున్న దవడలు – విచిత్రంగా వుంది అతని ముఖం.

చిన్నగా దగ్గాడు ప్రేమదాసు, ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడతను. వినయంగా నమస్కారం చేశాడు ప్రేమదాసు. అతను యాంత్రికంగా లేచి నిల్చుని ప్రతినమస్కారం చేసి "లోపలకు రండి" అన్నాడు.

"ప్రేమారావుగారు మీరే అనుకుంటాను" అతనికి ఎదురుగా వున్న ప్రేము కుర్చీలో కూర్చుంటూ అడిగాడు ప్రేమదాసు. తనని పరిచయం చేసుకొని.

"అవును నేనే" అని రెండు నిమిషాలాగి "ఎవర్నయినా ప్రేమిద్దామనుకుంటున్నారా" డైరక్టుగా టాపిక్‌లోకి దిగిపోయాడు ప్రేమారావు.

"అవును. ఎందుకో వారం రోజుల్నించీ ఎవర్నైనా ప్రేమిద్దామనిపిస్తోంది. నిల్చున్నా– కూర్చున్నా– నడుస్తున్నా– పడుకున్నా– ఏ పని చేస్తున్నా ఇదే ఆలోచన ఎవర్నైనా ప్రేమించాలని. కాని ఎవర్ని ప్రేమించాలో అర్థం కావటం కష్టంగా వుంది" అన్నాడు దీనంగా ప్రేమదాసు.

కొన్ని నిముషాల పాటు ప్రేమారావు మాట్లాడలేదు. మౌనంగా కూర్చుని దీర్ఘంగా ఆలోచించాడు. చివరికి నొసలు చిట్లించి సీరియస్‌గా ఆలోచిస్తూ "మీకు ఇలా అనిపించటానికి ఏదైనా కారణముందా?" అని అనిగాడు.

ప్రేమదాసు కూడా ఆలోచించినట్టు పోజు పెట్టి "ఒకరకంగా వుందనేచెప్పాలి. వారంరోజులక్రితం నాకు ఓ కలవచ్చింది. ఆ కలలో నేను స్కూటరుమీద మెయిన్ రోడ్డుమీద వెడుతున్నాను. బస్‌స్టాపు దగ్గరకు వచ్చేసరికి ఓ అమ్మాయి బస్ కోసం వెయిట్ చేస్తూ నిల్చుంది. చాలాఅందంగా వుంది. లావుగా పొడుగ్గా ఎర్రగా వుంది. కళ్ళకు కూలింగ్ గ్లాసులు. "లిఫ్టుకావాలా" అని అడిగాను ఆ అమ్మాయి ప్రక్క స్కూటరాపి తలవూపి ఎక్కికూర్చుంది. వాయువేగంతో పోనిచ్చాను. భయపడిపోయి నన్ను గట్టిగా బల్లిలా కరుచుకుపోయింది. అలా చాలాదూరం వెళ్ళాం. ఆ అమ్మాయి ఏదోపాట చిన్నగా పాడుతోంది. సిటీదాటి వెళ్ళిపోయాం. మెల్లిగా ఆ అమ్మాయి నన్ను వదిలేసింది. కొంత దూరం వెళ్ళి స్కూటరాపాను. వెనుక ఆ అమ్మాయిలేదు. ఎక్కడో పడిపోయి వుండాలి. ఆ తర్వాత మెలకువ వచ్చింది. లేచిచూస్తే మా ఇంటి ఎదురుగా వున్న బొమ్మగారు కనిపించింది. ఆ రోజునించి కలలో కనిపించిన అమ్మాయి ఎక్కడైనా కనిపిస్తుందేమోనని చూశాను. ఎక్కడా కనిపించలేదు. కనిపిస్తే ఆ అమ్మాయిని ప్రేమిస్తాను. లేకపోతే మరెవర్నైనా ప్రేమిస్తాను" అన్నాడు.


ప్రేమదాసు చెప్పినదంతా విని "ఒక్క క్షణం ఆగండి" అని ప్రేమారావు కుర్చీలోనుంచి లేచి గదిలో ఓ మూలగా వున్న చెక్క బీరువా దగ్గరకు వెళ్ళాడు.

దానిలోంచి చిన్న కవరు తీసుకొనివచ్చి మళ్ళీ ప్రేమదాసు ఎదురుగుగా కూర్చున్నాడు. కవరులోంచి కొన్ని ఫొటోలను బయటకు తీసాడు. దాదాపు వంద ఫోటోల వరకు వుంటాయి.

ఈ ఫోటోలు చూడండి దాసుగారూ. మీకు కలలో కనిపించిన అమ్మాయి వుందేమో - ఒకవేళ లేకపోతే మరెవరైనా ఓ అమ్మాయిని సెలక్టు చేసుకోండి, ఆ అమ్మాయిని గురించిన వివరాలు చెబుతాను. ఎలా ప్రేమించాలో కూడా చెబుతాను" అంటూ ఫోటోలను ప్రేమదాసు చేతికిచ్చాడు ప్రేమారావు.

ప్రేమదాసు ఒక్కొక్క ఫొటోని పరిశీలనగా చూస్తున్నాడు. తనకు కలలో కనిపించిన అమ్మాయి ఫోటో కనిపిస్తుందేమోనని. రకరకాల అమ్మాయిలు వివిధభంగిమల్లో వున్నారు. కొంతమంది నవ్వుతూ, మరి కొంతమంది ముఖాన్ని సీరియస్‌గా పెట్టి, కొంతమంది కోపంగా వున్నట్టు తీసిన ఫోటోలవి. ఒక అమ్మాయికి పళ్ళెత్తుగా వుంటే మరో అమ్మాయి కళ్లు చిన్నవిగా వున్నాయి. అప్పటికే అరవై ఫోటోలను చూశాడు ప్రేమదాసు. విసుగు పుట్టింది. తనకు కావలసిన అమ్మాయి ఫోటో దొరకలేదు.

ఒకవేళ ఆ అమ్మాయి నిజంగా లేదేమో- కలలో కనిపించిన అమ్మాయి నిజంగా వుండాలని ఎక్కడుంది? ఒకవేళ వున్నా ఎక్కడుందో? అయినా ఓపిగ్గా అన్ని ఫోటోలను చూస్తున్నాడు ప్రేమదాసు. ఎనభై ఫోటోలను చూసిన తర్వాత



అతని శ్రమ ఫలించింది. అతనికి ఎంతో సంతోషం కలిగింది. అదే ఫోటో —అదే ముఖం. అవే కూలింగ్ గ్లాసులు. తనకు కలలో కనిపించి తన స్కూటర్ ఎక్కిన అమ్మాయే ఈ అమ్మాయి, ఎంతో ఆశ్చర్య మనిపించింది. తన అదృష్ట మనకున్నాడు ప్రేమదాసు. లేక పోతే తనకు కలలో కనుపించినఅమ్మాయి నిజంగా వుండటమేమిటి? తిరునాల్లో తప్పి పోయిన భార్య ఏడాది తర్వాత కనిపించి నంత సంతోషమేసింది.

"ఈ అమ్మాయే" పెద్దగా అరిచాడు ప్రేమదాసు.

"నిజంగా మీ అదృష్టం దాసుగారూ" మీ కేసు సక్సెస్ అయినట్లే" అన్నాడు ప్రేమారావు.

ఆ అమ్మాయి ఫోటో తనదగ్గర ఉంచుకొని మిగిలిన ఫొటోలను ప్రేమా రావు కిచ్చాడు. ఆ ఫొటోల్ని కవరులో పెట్టి బీరువాలో దాచి వచ్చాడు.

"ఈ అమ్మాయి గురించి వివరాలు చెప్పండి" అడిగాడు ప్రేమదాసు.

"ఓ సిగరెట్ వుంటే ఇలా పారె య్యండి" అన్నాడు ప్రేమారావు.

షర్టు జేబులోనించి సిగరెట్ ప్యాకెట్ తీసి అందులో ఓ సిగరెట్ తీసి ప్రేమారావు కిచ్చి తను మరోసిగరెట్ వెలిగించుకొని లైటర్ అతనికి అందించాడు ప్రేమ దాసు.

సిగరెట్ దమ్ముకొట్టి పొగను రింగు లుగా బయటకు వదులుతూ మొదలు పెట్టాడు ప్రేమారావు.

"ఈ అమ్మాయి పేరు పంకజం. ఇంకా ఇరవై యేళ్ళు నిండలేదు. అందంగా వుంటుందని వేరే చెప్పనవ సరం లేదు. ఎందుకంటే మీకు కలలో కనిపించింది. అయినా చెప్పడం నాధర్మం కాబట్టి చెబుతున్నాను. అయిదడుగుల అయి దంగుళాల ఎత్తు, ఎత్తుకుతగ్గలావు. పిడి కెడు నడుము. ఇక ముఖం విషయంకొస్తే చంద్రుడితో పోల్చగూడదు. చంద్రుడికి మచ్చవుంది. ఈ అమ్మాయికి అది కూడా లేదు. కూలింగు గ్లాసులు ఈ అమ్మాయికి ప్రత్యేక ఆకర్షణ." ఇలా చెప్పుకు పోతుంటే ప్రేమదాసుకి విసుగుపుట్టింది.

"అమ్మాయి ఏం చేస్తుందో .. ఎలా పరిచయం చేసుకోవాలో. ఎలా ప్రేమిం చాలో చెప్పండి" అన్నాడు.

"చెబుతాను. ఈ అమ్మాయి ప్రస్తుతం బియ్యే సెకండియర్ చదువుతోంది. తండ్రిలేడు. తల్లి వుంది. అన్నదమ్ములు లేరు. ఇద్దరు అక్కయ్యలున్నారు. వారి దరికి పెళ్ళిళ్ళయినాయి. తల్లీ కూతురు వుంటున్నారు. గవర్నరుపేటలో సొంత యిల్లువుంది. కొంత క్యాష్ కూడా బ్యాంకులో వుందని అనుకోండి. ఇక క్యారెక్టర్ విషయానికొస్తే మనిషి మంచిది. స్నేహభావం ఎక్కువ. ఖోష లుగా వుంటుంది. మీరు ఎక్కువ శ్రమ పడకుండానే ఆమె పరిచయం సంపా దించగలరు. ఉదయం తొమ్మిదిన్నరకు గవర్నర్ పేట బస్టాపు దగ్గరకు వస్తుంది. బస్సులో కాలేజీకి వెళుతుంది. సాయంత్రం నాలుగున్నరకు తిరిగి అదే బస్టాపుదగ్గర దిగుతుంది. మీరుఎప్పుడైనా ఆమెతో పరిచయం చేసుకోవచ్చు. మా లవ్ ఇనిస్టిట్యూట్ సభ్యుడనని, నేను పంపానని చెప్పండి. ఆమె మీతో

మాట్లాడుతుంది. ఆ తర్వాత మీ ఇష్టం" అని ఆగాడు ప్రేమారావు.

"థాంక్స్. చాలా వివరాలు చెప్పారు. రేపే ఆమెను కలుసుకుంటాను.... ఇంతకీ మీ ఫీజెంతో చెప్పలేదు" అన్నాడు ప్రేమదాసు పాకెట్‌లో నించి పర్సు బయటకు తీస్తూ...

"ముందు ఫిప్టి ఇవ్వండి. తర్వాత మళ్ళీ అడుగుతాను."

ఐదు పదిరూపాయల నోట్లు తీసి ప్రేమారావు చేతిలో పెట్టాడు ప్రేమదాసు. జేబులో పెట్టుకున్నాడు ప్రేమారావు.

వెళ్ళొస్తానని చెప్పి మెట్లుదిగి వెళ్ళి పోయాడు ప్రేమదాసు.

* * *

మరుసటిరోజు ఉదయం—

తొమ్మిదింబావుకే బస్సుస్టాపు దగ్గరకు వెళ్ళాడు ప్రేమదాసు. జనం ఎక్కువగానే వున్నారు. మగవాళ్ళకంటే ఆడవాళ్ళే ఎక్కువ. ఆరోజు ప్రేమదాసు వెలట్ కలర్ పాంటు వేసుకున్నాడు. ఎర్రగీతల షర్టును టక్‌చేశాడు. కాళ్ళకు పాయింటెడ్ బూట్లు. జుట్టును నున్నగా పైకి దువ్వి రెండుమూడు వెంట్రుకలను బయటకుతీసి నుదుటిమీద వేసుకున్నాడు.

తొమ్మిదిన్నరకు వచ్చింది పంకజం. కాఫీరంగు వాయిల్ చీర, చుక్కలజాకెట్టు, ఎడమచేతికి గుండ్రటి వాచీ, కుడిచేతికి రెండు గాజులు, దోసగింజంత తిలకం, బొట్టు పెట్టుకుంది. కళ్ళకు కూలింగ్ గ్లాసులు, వాలుజడ, మల్లెపూలు.

పంకజాన్ని చూసిన ప్రేమదాసుకు గుండెలు కొంచెంగా అదిరాయి. కొంచెం కుదుటపడిన తర్వాత పక్కకు వెళ్ళి నిల్చున్నాడు. ప్రేమదాసుకేసి చూసింది పంకజం.

నవ్వాడు.

తనూ నవ్వింది.

చిన్నగా అన్నాడు. "లవ్ ఇనిస్టిట్యూట్‌నించి వచ్చాను."

నవ్వింది పంకజం.

"అతను పంపాడు" గొణిగాడు ప్రేమదాసు.

"అతను ఎవరు?"

"ప్రేమారావు?"

మళ్ళీ నవ్వింది పంకజం. మొక్కజొన్న గింజల్లా వున్నాయి పళ్ళు.

గిలిగింతలు పెట్టినట్లనిపించింది ప్రేమదాసుకు.

"మీ స్నేహం కోరివచ్చాను"

పంకజం ఏదో మాట్లాడబోయింది. కాని ఇంతలోనే బస్సు రావటంవల్ల "సాయంత్రం కలుద్దాం. నాలుగున్నరకు ఇక్కడకే రండి" అని "టాటా" చెప్పి బస్సులో ఎక్కి వెళ్ళిపోయింది పంకజం.

ప్రేమదాసు సంతోషంతో వూగిపోయాడు.

* * *

ఆ సాయంత్రం పంకజం చెప్పినట్లు గానేఆమెనుకలుసుకున్నాడు ప్రేమదాసు. ఇద్దరూ కలసి హోటల్‌కెళ్ళారు. ఇద్దరూ ఏవో తింటూ కబుర్లు చెప్పుకున్నారు. తనకు కల్లో పంకజంకనిపించడం, తను స్కూటరుమీద యెక్కించుకోవటం, ఆ తర్వాత జరిగిందంతా చెప్పాడు ప్రేమదాసు. విని యెంతో ఆనందించింది పంకజం. అయిదు రూపాయల బిల్లు చెల్లించి బయటకు వచ్చాడు ప్రేమదాసు

పంకజంతో.

ఇద్దరూ విడిపోయేముందు "రేపు మా ఇంటికి రండి" అని ఆహ్వానించింది పంకజం. ఇంటి అడ్రసు ఇచ్చింది.

ఆ రాత్రి ప్రేమదాసుకు నిద్రపట్ట లేదు.

ఆమరుసటిరోజుపంకజంకోరినట్లుగా ి అడ్రసు చూసుకొని పంకజం ఇంటికి వెళ్ళాడు ప్రేమదాసు. అతను వెళ్ళేసరికి ఇంటిముందు పూల మొక్కలకు నీళ్ళు పోస్తుంది, ఎవరో అమ్మాయి. ప్రేమ దాసు గేటునెట్టిన చప్పుడువిని తలెత్తి నవ్వుతూ "రండి" అన్నది.

పక్కకు తిరిగి చూశాడు ప్రేమదాసు తనప్రక్కన ఎవరైనా వున్నారేమోనని. ఎవరూలేరు. మరి ఎవర్ని ఈ అమ్మాయి రమ్మని పిలుస్తుంది?

"మిమ్మల్నే.... అక్కడే నిల్చున్నా రేం. లోపలకు రండి" మళ్ళీ అన్నది.

ఆ అమ్మాయి తననే పిలుస్తుందని రూఢి చేసుకున్నాడు ప్రేమదాసు. అతనికి నవ్వొచ్చింది. ఆ అమ్మాయికి మెల్ల కళ్ళు. రెండు కళ్ళు ఉత్తర దక్షిణ ధృవాల్లా వున్నాయి. అందుకే ఆ అమ్మాయి తనకేసి చూస్తున్నా ఎటో చూస్తున్నట్టు వుంది.

"పంకజంగారు లేరా" అడిగాడు ప్రేమదాసు.

నవ్వుతూ "మీరు మరీ విచిత్రంగా మాట్లాడుతారే .... పంకజాన్ని నేనే" అన్నది ఆ అమ్మాయి.

"సారీ.... మీరు పంకజం కాదు. దయ చేసి ఆమె ఇంట్లో వున్నదో లేదో చెప్పండి నాతో హాస్యమాడక" అన్నాడు ప్రేమదాసు కొంచెం విసుగ్గా...

"నేనే పంకజాన్ని" అన్నది మళ్ళీ ఆ అమ్మాయి.

"సారీ.... మీరుకాదు."

ఇంతలో ఆ అమ్మాయి ఏదో గుర్తుకు వచ్చిన దానిలా ఇంట్లోకి పరుగెత్తి కూలింగ్ గ్లాసులు పెట్టుకువచ్చింది.

పంకజం!!!

ప్రేమదాసుకు గుండె ఆగినట్లనిపించింది. విగ్రహంలా నిలుచుండిపోయాడు. ఇప్పటి వరకూ తను మాట్లాడింది పంకజంతోనా? అయితే పంకజానికి మెల్ల కళ్ళా ??

"ఇప్పటికైనా ఒప్పుకుంటారా నేను పంకజాన్నని" దగ్గరకు వచ్చి అన్నది పంకజం నవ్వుతూ.

అంతే ... అక్కడినించి రోడ్డుమీదకు పరుగుతీశాడు ప్రేమదాసు.

"దాసుగారూ" పిలుస్తోంది వెనుక నుంచి పంకజం. ప్రేమదాసు వెనక్కి తిరిగితే ఒట్టు.

* * *

తను ఎలా మోసపోయాడో అంతా వివరంగా చెప్పాడు ప్రేమదాసు—ప్రేమా రావుకి.

"క్షమించండి దాసుగారూ. నిజం నాకూ తెలీదు. మీరు మరో అమ్మాయిని సెలక్టు చేసుకోండి వివరాలు చెబుతాను" అని మళ్ళీ ఫోటోలుతెచ్చి ప్రేమదాసుకు ఇచ్చాడు.

పది నిముషాల తర్వాత ఓ అమ్మాయి ఫోటో సెలక్టుచేశాడు ప్రేమదాసు. అందంగానే వుందా అమ్మాయి. కొంచెం సన్నగా .. పెద్ద పెద్ద కళ్ళు.... చిన్న

ని ముక్కు .... ఫర్వాలేదని
అమ్మాయిలో ఏదో ఆక
ిపించింది ప్రేమదాసుకు.
యిగురించి చెప్పడం
ను. ప్రేమారావు.
మ్మాయి పేరు సావిత్రి.
డుంటయి డ్రైక్లీనింగ్
చేస్తుంది. గాంధీనగరంలో
ంద్రీ ఎవ్వరూ లేరు. మేన
వుంటోంది. పి. యు. సి
కుంది. ఇక అమెను పం
ోవాలంటే వరసగా రెండు
ను వెంబడించండి. ఆమెను
య్యండి. మూడో రోజు
ంచి రాత్రి ఇంటికివెడుతున్న
ను కలుసుకుని మిమ్మల్ని
ేసుకొని ప్రేమిస్తున్నానని

ిచి నిల్చున్నాడు ప్రేమ

వుంటె ఇవ్వండి. తర్వాత
" అన్నాడు ప్రేమారావు.
్ళిపోయాడు ప్రేమదాసు.

* *

మూడ్రోజుల వరకు ప్రేమ
రావుని కలుసుకోలేదు.
జుల తర్వాత ప్రేమారావు
రిక్షా ఆగింది. అందులో
గా క్రిందికి దిగాడు ప్రేమ
ంచేతో షర్టు జేబులోనించి
ు తీసి రిక్షావాడి కిచ్చాడు.
యింది.
కుంటుతూ మెల్లెక్కి పైకి
క

చేరుకున్నాడు ప్రేమదాసు.

ప్రేమదాసు వెళ్ళేసరికి ప్రేమారావు "కలచెదిరింది, కథమారింది" అని పాడు కుంటున్నాడు.

అలికిడి విని తల త్రిప్పి ప్రేమదాసు రూపాన్ని చూసి ఆశ్చర్యపోయాడు.

కుడిచేతికి బాండేజి వేసి కట్టుకట్టారు. మొహం నిండా గాట్లు. మూతి వంకర పోయింది. తలమీద కట్టు .... కళ్ళు లోతుకు పోయాయి.

"ఏమిటీ రూపం? ఏమయింది?" అడిగాడు ప్రేమారావు.

ప్రేమదాసుకు ఏడుపు వచ్చినంత పనయింది. ఎలాగో నిగ్రహించుకొని చెప్పాడు.

"మీరు చెప్పినట్లుగానే సావిత్రిని రెండు రోజులూ వెంబడించాను. నన్ను చూసినప్పుడల్లా నవ్వాను. కాని తను నవ్వలేదు. కోపంగా చూసింది. అయినా మూడో రోజు సావిత్రి షాపునించి ఇంటికి వెడుతుంటే దారిలో కలుసుకొని మీరన్నట్లుగానే నేను ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నానని చెప్పాను. ఈడ్చి దవడమీద కొట్టింది. నాకూ కోపం వచ్చి సావిత్రిని గట్టిగా వాటేసుకుని బుగ్గల మీద ముద్దు పెట్టుకున్నాను. పెద్దగా అరిచింది సావిత్రి. నలుగురూ పోగైనారు. నేనూ తనని బలవంతం చెయ్యబోతు న్నానని చెప్పింది సావిత్రి అక్కడి వారందరికీ. ఇంకేముంది? నా కీళ్ళు విరగ్గొట్టారు.

నేను ఎంత చెప్పినా వినలేదు. చివ రికి ఎట్లాగో బయటపడ్డాను. చావు

తప్పింది" చెప్పడం ముగించాడు ప్రేమదాసు

కొంచెంసేపు మాట్లాడ లేకపోయాడు ప్రేమారావు.

తర్వాత "క్షమించండి దాసుగారూ. సావిత్రి మిమ్మల్ని అపార్థం చేసుకుని వుంటుంది. ఆమె విషయం నేను చూసు కుంటాను. ఈ లోగా మీరు మరో అమ్మాయిని ప్రేమించండి సెలక్టు చేసు కొని" అంటూ వెళ్ళి ఫోటోలు తీసు కొచ్చాడు ప్రేమారావు.

"వద్దుబాబో ... నన్నిలా బ్రతక నివ్వండి ... నా కిప్పుడు ఎవర్నీ ప్రేమిం చాలని లేదు నాకు బ్రతకాలని వుంది" అని కుంటుతూ మెట్లు దిగి పోయాడు ప్రేమదాసు. అలా వెడుతున్న ప్రేమ దాసుని చూస్తున్న ప్రేమారావుకు కొంచెం జాలి కలిగింది.

సమాప్తం.

## చందా వివరాలు

| | |
|---|---|
| విడి ప్రతి | రు. 2-00 |
| సంవత్సర చందా | 25-00 |
| (ఆగస్టు 15 సంచిక విడి ప్రతి 3-00) | |
| సంక్రాంతి స్పెషల్ | 5-00 |
| మొత్తంగా | 30-00 |

## అనామిక ప్రకటన రేట్లు

| | |
|---|---|
| కవరు పేజీ | రు. 800-00 |
| 2 & 3 కవరు పేజీలు | 300-00 |
| ఓపెనింగ్ | 250-00 |
| పూర్తిపేజి | 200-00 |
| పేజిలో సగం | 100-00 |

"అనామిక" అన్ని హిగ్గిన్ బాదమ్సు, రైల్వే బుక్ స్టాల్సులోను దొరుకుతుంది.